రాజకీయ కక్షతో ఆకృతి మార్పు

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్
- బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్
- సీఎం దిష్టిబొమ్మ దహనం చేసిన బీఆర్ఎస్ నేతలు

అన్నానగర్ చౌరస్తాలో నినదిస్తున్న బీఆర్ఎస్ నేత గజ్జెల నాగేశ్, పార్టీ నాయకులు

సీతాఫల్‌మండి చౌరస్తాలో తెలంగాణ తల్లి చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలతో కలిసి క్షీరాభిషేకం చేసున్న కార్పొరేటర్ హేమ

ముషీరాబాద్, డిసెంబర్ 10: రాజకీయ కక్షతో తెలంగాణ తల్లి ఆకృతి మార్చేసి తెలంగాణ అస్తిత్వాన్ని కనుమరుగు చేసే కుట్ర జరుగుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆరోపించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన తెలంగాణ తల్లిని మార్చడం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. విగ్రహం రూపురేఖలు మార్చడాన్ని నిరసిస్తూ మంగళవారం బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపు మేరకు రాంనగర్ చౌరస్తాలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం బతుకమ్మను విస్మరించిందని, తెలంగాణ అంటేనే బతుకమ్మ అని అన్నారు. బతుకమ్మ లేని తెలంగాణ తల్లి కాదని, కక్షసాధింపుగానే విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు ఉందన్నారు. ప్రజల్లో ఉవ్వెత్తున నిరసన వ్యక్తమవుతుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ విభాగం నేత ముఠా జయసింహ, డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు బి.శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాకేష్, శ్యామ్‌యాదవ్, ముచ్చకుర్తి ప్రభాకర్, ఆకుల అరుణ్, సురేందర్, కేశపురం అరుణ్, సయ్యద్ అస్లాం, నేత శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి, ముఠా నరేశ్, అబ్బు, శివముదిరాజ్, గోపీ, హమ్మద్ పాల్గొన్నారు.

ముషీరాబాద్ డివిజన్‌లో తెలంగాణ తల్లివిగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్తీక్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషెకం చేశారు. కార్యక్రమంలో అజయ్‌ముదిరాజ్, సిరిగిరి శ్యామ్, బాల్‌రాజ్‌గౌడ్, రాజు, సత్యరాయణ, సదా, వెంకటేశ్, సిద్ధిఖి, అరుణ్, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహంతో రాజకీయమా!

మారేడ్‌పల్లి: తెలంగాణ తల్లి విగ్రహంతో రాజకీయం చేయడం సిగ్గుచేటు అని, సీఎం రేవంత్‌కు త్వరలోనే గట్టి బుద్ధి చెబుతారని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్ అన్నారు. ఆత్మగౌరవాన్ని చాటేలా ఉన్న విగ్రహ మార్పును నిరసిస్తూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం కంటోన్మెంట్ అన్నానగర్ చౌరస్తాలో మాజీ బోర్డు సభ్యురాలు అనిత, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనకు మాజీ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ హాజరైయ్యారు. విగ్రహానికి పంచామృత అభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కక్షసాధింపు చర్యల్లో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చారని అన్నారు. ఉద్యమ సమయంలో ప్రజలు కొలిచిన తెలంగాణ తల్లినే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొలుసుకున్నామని చెప్పారు. బతుకమ్మని వేరు చేసి తెలంగాణ ఆడపడుచులను అవమానించడం సరికాదన్నారు. కేసీఆర్ 14 ఏండ్ల సుదీర్ఘ పోరాటాల తోనే రాష్ట్రాన్ని సాధించి, అధికారం చేపట్టారన్నారు. బంగారు తెలంగాణ దిశగా అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇస్తామన్న, హామీలన్నీ నీటి మూటలుగా మిగిలిపోయాయనని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జంగిలి రాజు, సాయికిరణ్, కనకయ్య, మురళీయాదవ్, పనస సంతోష్, కిరణ్, దేవులపల్లి శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

ఎవరి రూపాన్ని దృష్టిలో పెట్టుకొని మార్చారు

సికింద్రాబాద్: ఎవరి రూపాన్ని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ తల్లి నమూనాను రూపుదిద్దారని సీఎం రేవంత్‌రెడ్డిని కార్పొరేటర్ హేమ ప్రశ్నించారు. విగ్రహ మార్పును నిరసిస్తూ తెలంగాణ తల్లి చిత్రపటానికి నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు సీతాఫల్‌మండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కార్యకర్తలతో ర్యాలీగా వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా ఆరు గ్యారెంటీలు అమలు చేయక పోవడాన్ని నిరసిస్తూ సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేసి విచారణ పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. మాకు కేసులు, జైళ్లు కొత్త కాదని ఆమె అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శైలెందర్, జాకీర్, కరీం లాలా, శరణ్, లూకేష్, సద్దాం, మహిళ నాయకులు లక్ష్మి, విజయ, జ్యోతి, లలిత, సరోజిని, ప్రవళిక, జాన్సి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి

సీతాఫల్‌మండి చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసున్న కార్పొరేటర్ హేమ, తదితరులు

బ్యాచిలర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 10: ఓయూ పరిధిలోని బ్యాచిలర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎల్‌డీ/ఐడీ/హెచ్ఐ/ఎఎస్‌డీ) రెండో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సు ప్రవేశాల గడువు పెంపు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 10: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సులో ప్రవేశాల గడువును పొడగించినట్లు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ.పాండురంగారెడ్డి తెలిపారు. నగరంలోని పలు ప్రముఖ ఆస్పత్రుల సహకారంతో ఫిజిక్స్ విభాగం అందిస్తున్న కోర్సులో చేరేందుకు ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్‌లో కనీసం 60 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసి ఉండాలని చెప్పారు. ప్రవేశ పరీక్ష ద్వారా ప్రవేశాలు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తులను రూ.500 అపరాధ రుసుముతో ఈనెల 19 వరకు స్వీకరిస్తామని అన్నారు. ప్రవేశ పరీక్షను ఈనెల 21వ తేదీన నిర్వహిస్తామన్నారు. వివరాలకు www.ouadmissions.com, www.osmania.ac.in వెబ్‌సైట్‌లలో చూసుకోవచ్చని సూచించారు.

నిరుపేదలను ఆదుకోవాలి

చిక్కడపల్లి, డిసెంబర్ 10: నిరుపేదలను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేశ్ వర్మ అన్నారు. మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని భారత్ సేవా ఆశ్రమంలో మున్సిపల్ వర్కర్స్, నిరుపేదలకు దుప్పట్ల, దుస్తులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గవర్నర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ విపత్తులు వచ్చినా భారత్ సేవాశ్రమం ముందు వరసలో ఉండడం అభినందనీయమన్నారు. సేవాశ్రమ నగర అధ్యక్షుడు స్వామి మునిశ్వరానంద, కార్యదర్శి స్వామి వెంకటేశ్వరానంద పాల్గొన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా జరిపే పండుగ క్రిస్మస్

మారేడ్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

అమీర్‌పేట్/బేగంపేట్, డిసెంబర్ 10: ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎస్ఆర్‌నగర్ క్రిస్టియన్ ఫెల్లోషిప్ చర్చి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారికి ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చి కోఫాస్టర్ జాయ్ సైమన్ పీటర్, ప్రతినిధులు పాల్ బసవయ్య, జాకీర్ హుస్సేన్, జాకోబ్, షీబాపాల్, బీఆర్ఎస్ నాయకులు అశోక్‌యాదవ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బీకేగూడలో అయ్యప్ప మహాపడిపూజ

సనత్‌నగర్ బీకేగూడలో బీఆర్ఎస్ నాయకుడు నిరుడు క్రిష్ణ నివాసంలో జరిగిన అయ్యప్ప స్వామి పడిపూజలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, పుట్నాల శేఖర్, పి.కుమార్, దాడి ప్రవీణ్‌రెడ్డి, వి.కరుణాకర్‌రెడ్డి, రాజేష్ ముదిరాజ్, కట్టా బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

– అమీర్‌పేట్, డిసెంబర్ 10

తెలంగాణ తల్లి మన అస్తిత్వానికి ప్రతీక

అడ్డగుట్ట, డిసెంబర్ 10: తెలంగాణ తల్లి మన అస్తిత్వానికి ప్రతీక అని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సునీత పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ తల్లి విగ్రహాన్ని మార్చడమంటే తెలంగాణ అస్తిత్వంపై కుట్ర చేయడమేనని తెలిపారు. ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన తల్లిని మార్చడం సీఎం రేవంత్ సర్కార్ అహంకారానికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు.

టెక్నాలజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ప్రొ.శ్రీనునాయక్

ప్రొఫెసర్ శ్రీనునాయక్‌ను అభినందిస్తున్న ఓయూ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 10: ఓయూ టెక్నాలజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ శ్రీనునాయక్ నియమితులయ్యారు. ఆయనతో పాటు సెంటర్ ఫర్ సైబర్ సెక్యూరిటీ అండ్ సైబర్ లా జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ రాధికాయాదవ్, కామర్స్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎ.ప్యాట్రిక్ నియమితులయ్యారు. ఈ మేరకు వారికి ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు అధ్యాపకులు, అధికారులు అభినందించారు.

బొల్లారం, డిసెంబర్ 10: తెలంగాణ తల్లి విగ్రహం నుంచి బతుకమ్మను వేరుచేసి ఆడపడుచులను అవమానపర్చారని కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్ అన్నారు. మంగళవారం లోక్‌నాథ్ పార్టీ కార్యకర్తలతో కలిసి బొల్లారం బజార్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పంచామృతాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ బతుకమ్మను వేరు చేసి ఆడపడుచులను అవమానపరుచడంతో పాటు, రాష్ట్ర సంస్కృతిని దెబ్బ తీశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు జంగాల మురళీయాదవ్, చందర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో రెండోరోజు పూజలు

కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు

మారేడ్‌పల్లి, డిసెంబర్ 10: సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంలో రెండో రోజు పూజలు ఘనంగా జరిగాయి. మంగళవారం అమ్మవారి పంచలోహ విగ్రహానికి 81 కళశాలతో 81 ద్రవ్యాలతో జరిపిన మహాస్నపనం, నవ చండీ హోమం పూజలు జరిగాయి. నేడు ఆలయంలో ఉదయం 8 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని ఎండోమెంట్ అధికారులు, నిర్వాహకులు తెలిపారు.

ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 10: రాష్ట్రంలోని గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న లైబ్రేరియన్, అనుబంధ పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా తక్షణమే భర్తీ చేయాలని లైబ్రేరీ సైన్స్ విద్యార్థుల, నిరుద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ గత 35 ఏళ్లుగా నియామకాలు చేపట్టలేదని గుర్తు చేశారు. దీంతో పౌరగ్రంథాలయాలు నిర్వీర్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లైబ్రేరీ సెంట్రల్ ఎక్సైజ్, సేవా పన్ను 8 శాతం వసూలు చేస్తున్నప్పటికీ ఆ నిధులను గ్రంథాలయాలకు కేటాయించడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వాల వైఖరితో పౌరగ్రంథాలయాలు మూసివేసే పరిస్థితుల్లో ఉన్నాయని వాపోయారు. గురుకుల పాఠశాలల్లో నియమించిన విధంగానే ఉన్నత పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేసి, వాటిలో అర్హత గల లైబ్రేరియన్లను నియమించాలని డిమాండ్ చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఈ అంశాన్ని ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే లేవనెత్తుతానని హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమం లో సంఘం నాయకులు ధర్మేంద్ర, బా బురాం, మహేశ్, రమేశ్, సీతారామ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సహాయకుల కేంద్రం భేష్

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 10: దూర ప్రాంతాల నుంచి చికిత్స కోసం గాంధీ దవాఖానకు వచ్చే రోగి, సహాయకులకు జనహిత షెల్టర్ హోం చేయూత అభినందనీయమని మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన సేవాభారతి సంస్థ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి విజయ్ పురానిక్ అన్నారు. తెలంగాణ కార్యనిర్వాహక కార్యదర్శి వాసుతో కలిసి ఆయన మంగళవారం జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీ దవాఖానలో నిర్వహిస్తున్న షెల్టర్ హోమ్‌ను సందర్శించారు. ఏప్రిల్ 2024 నుంచి ఇక్కడ లభిస్తున్న ఉచిత సేవల గురించి మేనేజింగ్ ట్రస్టీ ఎస్.నర్సింహమూర్తి, షెల్టర్ హోమ్ మేనేజర్ నందకుమార్ వారికి వివరించారు. పలు జిల్లాల నుంచి చికిత్స కోసం వచ్చే రోగులు, వారి సహాయకులకు, కుటుంబ సభ్యులకు ఉచితంగా వసతి, తాగునీరు, స్నానపు గదులు, మరుగుదొడ్లు, దుప్పట్లు, మ్యాట్లు, దాతల సహకారంతో ఉదయం అల్పాహారం, రెండు పూటలా భోజన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. గాంధీ, ఉస్మానియా, నీలోఫర్, ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానల్లో బయటి రోగుల విభాగంలో హెల్ప్ డెస్క్ కూడా నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

ముఖ్యమంత్రి కప్-2024 ప్రారంభం

అమీర్‌పేట్, డిసెంబర్ 10: తెలంగాణ క్రీడా ప్రాధికార సంఘం ఆధ్వర్యంలో అమీర్‌పేట్ మండల స్థాయి క్రీడలు మంగళవారం అమీర్‌పేట్ గురుగోవింద్‌సింగ్ స్టేడియంలో తహసీల్దార్ పి.పద్మసుందరి ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే క్రీడల్లో కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయి. బుధ, గురువారాల్లో జరిగే పోటీలు సనత్‌నగర్‌లోని కార్మిక సంక్షేమ కేంద్రం మైదానంలో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మండల స్థాయిలో జరుగుతున్న పోటీల్లో విజేతలు, జిల్లాస్థాయి పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. వేడుకలను డిప్యూటీ తహసీల్దార్ కె.మాధవి, డిప్యూటీ ఈవో యాదయ్య, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బాలకృష్ణ, శాట్ కోచ్‌లు హేమలత, ప్రవీణ్, అష్రఫ్, అరుణ్ పర్యవేక్షించారు.

క్రీడలు మానసిక వికాసానికి దోహదం..

చిక్కడపల్లి: క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడుతాయని హిమాయత్‌నగర్ మండల తహసీల్దార్ సంధ్యరాణి అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. మంగళవారం దోమలగూడ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రభుత్వ కళాశాలల్లో సీఎం కప్ మండల స్థాయి క్రీడలను తహసీల్దార్ సంధ్యరాణి, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ విజయ్‌లక్ష్మి, సుమన్ రాథోడ్‌తో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కబడ్డీ, కోకో, వాలీబాల్, ఫుడ్‌బాల్, యోగా పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ రఘు విష్ణు, అధికారులు పాల్గొన్నారు.

ఓయూను సందర్శించిన తుర్కిమెనిస్థాన్ బృందం

తుర్కిమెనిస్థాన్ రాయబార కార్యాలయ బృందంతో వర్సిటీ అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 10: ఓయూను తుర్కిమెనిస్థాన్ రాయబార బృందం మంగళవారం సందర్శించింది. తుర్కిమెనిస్థాన్ ఎంబసీ కాన్సుల్ శముహమ్మత్ ముహమ్మదోవ్ నేతృత్వంలోని బృందం ఓయూ అధికారులతో సమావేశమైంది. ఓయూతో కలిసి పనిచేసే అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ముహమ్మదోవ్ మాట్లాడుతూ విద్య, బోధన, పరిశోధనల్లో ఓయూతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సమావేశంలో తుర్కిమెనిస్థాన్ ఎంబసీ సెకండ్ సెక్రెటరీ ఇస్కెందర్ అతలియేవ్, ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గడ్డం నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్‌నాయక్, ఓయూ ఆఫీస్ ఆఫ్ ది ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ, మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ శివరామకృష్ణ, జాయింట్ డైరెక్టర్లు ప్రొఫెసర్ సరితారెడ్డి, ప్రొఫెసర్ శ్రీలత, ప్రొఫెసర్ ప్యాట్రిక్ తదితరులు పాల్గొన్నరు.

మహిళలపై హింసను నిర్మూలించాలి

బన్సీలాల్‌పేట్: మహిళలపై జరుగుతున్న హింస అందరిని ఆందోళన కలిగిస్తున్నదని, హక్కులు, చట్టాల గురించి అవగాహన కల్పించాలని బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినం సందర్భంగా మంగళవారం బన్సీలాల్‌పేట్ సేవా సంఘం కమ్యూనిటీ హాల్‌లో ఎస్ఆర్డీ ఆధ్వర్యంలో 'స్త్రీలు–బాలికలపై జరుగుతున్న హింసను నిర్మూలించడానికి అంతర్జాతీయ ప్రచారోద్యమం'లో భాగంగా స్థానిక బండమైసమ్మనగర్ బస్తీలో అవగాహన నిర్వహించారు. శిబిరంలో రెయిన్‌బో ఫౌండేషన్ డైరెక్టర్ అనురాధ, బాల్యమిత్ర నెట్‌వర్క్ కన్వీనర్ అంబిక, కబీర్, ఇందిర, సుజాత, ఎస్ఆర్డీ ప్రతినిధులు శివరాణి, ఇందిరాభారతి, వెంకటేశ్వరి, అస్రాజబీన్, లక్ష్మి, స్వప్న, సుమతి పాల్గొన్నారు.

పెయింటింగ్స్ ఆకట్టుకునేలా ఉండాలి

అడ్డగుట్ట, డిసెంబర్ 10: ప్రజలను మంత్రముగ్ధులను చేసేవిధంగా పెయింటింగ్స్ ఉండాలని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. తుకారాంగేట్ రోడ్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) వద్ద జరుగుతున్న పెయింటింగ్ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చూపరులను ఆకట్టుకునే విధంగా అందమైన చిత్రాలను రోడ్డుకు ఇరువైపుల చిత్రీకరించనున్నట్టు ఆమె తెలిపారు. పెయింటింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె సూచించారు. ఆర్‌యూబీ నిర్మాణంతో దశాబ్దాల ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపించిన ఘనత బీఆర్ఎస్ పార్టీ, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు దక్కుతుందని ఆమె గుర్తు చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ పద్మలత, ఏఈ తివారీ, బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, సత్తయ్యగౌడ్, దాసరి శ్రీనివాస్, వసంత, ఎల్లయ్య, అమర్ బాన్సోడే, రామప్ప చారి, దేవయ్య, రమా, వసంత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ వద్ద పెయింటింగ్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

హరికథా మహోత్సవాలు

సిటీబ్యూరో: హరికథాపితామహ ఆదిభట్టనారాయణదాస, వారి శిష్యుడు నేతి లక్ష్మినారాయణ భాగవతుల జయంతి సందర్భంగా నల్లకుంటలోని శ్రీశృంగేరి శంకర మఠంలో హరికథామహోత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం అన్నమయ్య పరివారం నుంచి యన మండ్ర వెంకటకృష్ణయ్య, నేతి కుటుంబం నుంచి శ్రీనివాస్, నటరాజ్ దంపతులు, సుజాత, శారద జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ నారాయణదాసు భారతావనిలో అవతరించిన అపరశారదమాత ప్రతిరూపమని కొనియాడారు.

కలుషితనీటి సమస్య పరిష్కరించాలి

చిక్కడపల్లి, డిసెంబర్ 10: రాంనగర్ డివిజన్‌లోని బృందావన్‌కాలనీ, పద్మకాలనీ ఫెస్–3, తదితర ప్రాంతాల్లో నెలకొన్న కలుషిత నీటి సరఫరా, మంచినీటి ప్రెషర్స్, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదర్శ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వాటర్‌వర్క్స్ డీజీఎం మోహన్, మేనేజర్ జీవన్‌జ్యోతికి వినతిపత్రం ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు సత్తయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు బి.వెంకట్‌స్వామిగౌడ్, కార్యదర్శి భరత్ భూషణ్, కార్యదర్శి చంద్రకాంత్ మాట్లాడుతూ మంచినీటి పైప్‌లైన్ 40 ఏండ్ల నాటిది కావడంతో లోప్రెజర్, కలుషీత నీటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే నూతన పైప్‌లైన్ వేసి సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.

బీసీ ఫెడరేషన్, కార్పొరేషన్లకు నిధులివ్వాలి

చిక్కడపల్లి, డిసెంబర్ 10: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం బడ్జెట్‌లో బీసీ ఫెడరేషన్, కార్పొరేషన్లకు కేటాయించిన రూ.50కోట్ల నిధులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి అధ్యక్షుడు ధర్మారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ ఫెడరేషన్, కార్పొరేషన్లకు పాలక మండళ్లలను ఏర్పాటు చేయాలని, దూదేకుల కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీసీలకు యాభై శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేవంలో ప్రధాన కార్యదర్శి కీర్తి యుగందర్, గ్రేటర్ అధ్యక్షుడు వీరప్ప, నాయకులు షేక్ సయ్యద్ బాషా, కిరణ్‌కుమార్, లింగయ్య, సునీత, సదానందం, కిరణ్‌చారి, చందులాల్, దుర్గారావు పాల్గొన్నారు.

బీసీ ఫెడరేషన్ కులాల సమితి అధ్యక్షుడు ధర్మారావు